# సరదా

సజగ్నాథ్

రాత్రి సుమారు 11½ గంటలయింది. అంతా గాఢాంధకారంలో మునిగివుంది. మేఘాలు దట్టంగా కమ్ముకున్నాయ్. భోరున గాలి వీస్తుంది. చిన్న చినుకులు పడుతున్నాయ్.

ఆవీధి అంతటికీ కొసానివుంది యిల్లు. రొజ్జ గాలికి భరించలేక తెరచివున్న కిటికీ రెక్కల్ని మూసి పడుకుంది అమ్మాజీ. భర్త క్యాంపులో వుండడంచేత, కొసా యిల్లవడంచేతా, సాయం యెవ్వరూ లేకపోవడంచేతా ఆమెకు భయం వెయ్యడం మొదలుపెట్టింది.

చిన్న చినుకులు పెద్దజల్లుగా మారాయి.

ఇంతలో అయింటి తలుపులెవరో తట్టారు. ఇంత రాత్రప్పుడు యెవరువస్తారా? అనిపించింది.

మళ్ళీ తలుపు చప్పుడు—ఆమెకు చాల భయం వేసింది.

తిరిగీ తలుపు చప్పుడు. మెల్లమెల్లగా వెళ్లి తలుపు తీసింది. ఎదురుగుండా ఓవ్యక్తి ప్రత్యక్ష మయ్యాడు. పెద్దగడ్డాలు—మీసాలు—ఒక సులో చనంజోడూ—లాంగ్ కోటూ—తురక టోపీ—గల్లా పైజమా—వేస్టుకోటూ—యివన్నీ చూసేసరికి ఆమెకు చాలాభయంవేసింది.నోటంట మాటరాలేదు.

“పద లోపలికి” అన్నాడు గట్టిగా.

ఆ కంఠం పరిచయంగల కంఠంలాగే వుంది.

“ఎవరుమీరు” అంది ధైర్యం తెచ్చుకొని.

“ముందు లోపలికి...ఊఁ...నడు” అన్నాడు హెచ్చుస్థాయిలో.

భయంచేత యేమీ అనలేక పక్కకు తప్పు కొంది.

చరచరావెళ్ళి ఆమె పడుకున్న మంచంమీద బైఠాయించాడు. తనయింట్లో పరాయివాడు యింత స్వతంత్రంగావచ్చి కూర్చొన్నందుకు కోపం భయం కలిగాయ్.

ధైర్యం తెచ్చుకొని “మీరెవరో చెప్పండి” అంది.

“ఇలాకూర్చో చెప్తాను” అన్నాడు.

“మీరెవరో చెప్పకుండ...యింట్లో మగవాళ్లు లేనపుడు రావడం ధర్మంకాదు.”

“ధర్మం యేమిటి? అధర్మం యేమిటీ?”

“ఇంతరాత్రప్పుడు యిక్కడకు రావడం యేమిటీ?”

“కారణంలేకుండా వస్తానా?”

“మాఆయన లేరు, యెల్లుండి వస్తారు, యిక వెళ్ళిపొండి.”

“మీఆయన దగ్గరకు వస్తేగా?”

“అయితే మరెవరికోసం?”

“—నీకోసం”

“మీమాటలు నాకేమీ అర్థంకావడం లేదు. ఇది సంసారిల్లు అనుకున్నారా? సానియిల్లు అను కున్నారా?”

“సంసారిల్లని తెలుసు, నువ్వు మా జగ న్నాథ్ పెళ్లానివని తెలుసు.”

“పగలంతా వేగులు కనుక్కొని రాత్రి దోపిడిచేసేవాళ్ళలా వున్నారు.”

“నీ హృదయాన్ని దొంగిలించడానికి వచ్చాను.”

“ఒళ్లు దగ్గరవుంచుకొని మాట్లాడండి సంసా రులతో మాట్లాడేటప్పుడు.”

“నీ శరీరం నా శరీరం కలిస్తేనేకాని నాకు సరిగ్గా మాటలురావు.”

“ఓరీ! దుర్మతీ! దుంధుభి! రుదిరోద్గారీ! పేరుగ్గారీ! ఎవడవురానువ్వు? అవతలకు వెళతావా? లేదా?”

“నే వెళ్ళను.”

“నాకు భయంవేస్తున్నాది. ఒక్కకేక వేశా నంటే నిన్ను సాఫ్‌చేసి వదిలేస్తారు తెలుసా?”

“భయంవేస్తే నన్ను కౌగలించుకోకూడదా?”

“ఛీ! దుర్మార్గుడా! న్యాయంగా చెప్తున్నా, అవతలికిపో. లేకుంటివా నీవొళ్ళు హూనం అవు తుంది.”

"ఎందుకు అలా గింజుకుపోతావ్ కూర్చో."

"ఛీ! పాపీ"

"పోనీ! నేనే నీదగ్గరకు వస్తా" అంటూ వెళ్తాడు.

"ఏమర్రోయ్" అని కేక పెడుతుంది."

"గోలపెట్టేవంటే కిరీటపూజ అవుతుంది."

మళ్లీ కేకపెట్టడానికి ప్రయత్నిస్తుంది.

కౌగలించుకుందికి ప్రయత్నిస్తాడు దగ్గరగా వెళ్ళి నోరుమూసిన తర్వాత.

ఆమె తీసిపెట్టి ఒక లెంపకాయ కొడుతుంది.

ఆదెబ్బతో గడ్డం మీసాలు వూడిపోతాయి. కళ్ళజోడు బద్దలైపోతుంది. బుర్రమీదిటోపీ జారిపోతుంది.

"మీరేనా?"

"ఆ" అన్నాడు చెంప తడుముకుంటూ.

"క్యాంపునుంచేనా?"

"ఆ"

"అయితే యీనాటకం యేమిటి?"

"అదో సరదా"

"ఏమిటి సరదా... లెంపకాయ" నవ్వింది, ఫక్కున నవ్వింది.

"చాలా గట్టిగా కొట్టేసేవ్"

"క్షమించండి"

"క్షమించడానికి నీవల్లలేదు. నువ్వే నన్ను క్షమించాలి."

"అయితే బెడ్డింగ్ అవీ యేవీ?"

"రేపు దయచేస్తాయ్"

"ఈ మీసాలు, గడ్డం, టోపీ, సులోచనం జోడూ దండుక్కొన్నారన్నమాట. సరదాకి దండుగేమిటి. మంచి సరదాయే.





ముద్దులొలుకు ముచ్చటైన తలకట్టు!

'కోలా' కుదుళ్లకు, తలవెండ్రుకలకు బలమునిచ్చి నిగనిగలాడు నల్లని నిడుపాటి తలవెండ్రుకలను దట్టముగ పెంచును.

తలవెండ్రుకలు రాలుట, నెరయుట, చుండ్రు, బట్టతల, పేనుకొరుకు మొదలైన తలవెండ్రుకలకు సంబంధించిన సమస్త వ్యాధులను నిర్మూలించును.

వ్యాధులవల్లగాని, ప్రసవమువల్లగాని రాలిపోయినతలవెండ్రుకలను తిర్గి సృష్టించుటలో 'కోలా' వొక్కటే సమర్థతగల తలనూనె.

సుప్రసిద్ధ ఆంధ్ర, అరవ, కర్ణాటక సినిమా తారలచే 'కోలా' విరివిగా వాడబడుచున్నది నేటినుంచి మీరుకూడా 'కోలా'ను వాడండి. 'కోలా' వర్తకు లందరివద్దనూ దొరకును. వెల రూ. 0—14—0.

కోలా వుపయోగించి రు. 500/-లు
బహుమతులు పొందండి!

సోల్ డిస్ట్రిబ్యూటర్సు :—
ది విజయా ట్రేడింగు
కంపెని, బెజవాడ.

కోలా హెయిర్ టానిక్